## క్లుప్తంగా

### అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సహాయ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సోమేశ్వరరావు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన నష్ట నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన సేవలు అందించాలి



జరజాపుపేట యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

నెల్లిమర్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్. భాస్కరరావు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అలాగే కొత్తగా నిర్మించిన హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం మిమ్స్‌లో ఏర్పాటు చేసిన కోవిడ్ వీఆర్ఎల్‌డీ ల్యాబ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్. సూర్యనారాయణ, వైద్యులు ఆర్. అచ్యుత్‌కుమారి, రవికుమార్, మణికుమారి పాల్గొన్నారు.

### కుష్టును పారదోలాలి..



ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

పూసపాటిరేగ: కుష్టు వ్యాధిని పారదోలి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ ప్రమీలాదేవి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. రాజావీధి, భూడివీధి, జాతీయరహదారి, సాలిపేట మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది ఆర్‌వీ రమణ, వేదమణి, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

### హామీలు అమలు చేయాలి...



మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రామారావు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ.. కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబూరావు, బి. హరిబాబు, జె. శ్రీను, బి. రాము, టి. లక్ష్మి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే బడ్డుకొండకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డెంకాడ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు భోగాపురం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం వినతి పత్రం అందజేశారు. 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మోపాడలో ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

- పోటాపోటీగా తలపడుతున్న క్రీడాకారులు



పూసపాటిరేగ: క్రీడలను వీక్షిస్తున్న పీడీ శాంతాకుమారి, అప్పలనాయుడు , శ్రీనివాసరావు, తదితరులు



విజయనగరం: పోలీస్ బ్యారెక్స్‌లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



పూసపాటిరేగ : బ్యాటింగ్ చేస్తున్న ప్రజాప్రతినిధి



నెల్లిమర్ల రూరల్: అలుగోలు క్రీడా మైదానంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



విజయనగరం: క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన 20వ వార్డు సచివాలయం క్రీడాకారులు



విజయనగరం రూరల్: జొన్నవలసలో కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం



డెంకాడ: బ్యాటింగ్ చేస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



విజయనగరం రూరల్: నారాయణపురంలో క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో బుధవారం పోటీలు నిర్వహించగా.... ఈ పోటీల్లో 14 సచివాలయాలకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. ముందుస్తుగా గుర్తించిన రాజీవ్ క్రీడామైదానం, విజ్జీ స్టేడియం, అయోధ్యా మైదానం, పోలీస్ బ్యారెక్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మైదానం, పాలిటెక్నికల్ కళాశాల మైదానాల్లో 39 మ్యాచ్‌లు నిర్వహించారు. సచివాలయ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి మండల/పట్టణ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు. 28న మిగిలిన సచివాలయాలకు సంబంధించి క్రికెట్ పోటీలు నిర్వహించనుండగా.... 29న వాలీబాల్ పోటీలు, 30న ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో సచివాలయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి..**

డెంకాడ: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని బొడ్డవలస సచివాలయం పరిధిలోని క్రీడాకారులకు జొన్నాడ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించారు. ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా ఒక మంచి వేదికన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, ఎర్ర శ్రీనివాసరావు, త్రిపురగిరి మురళి, ఈఓపీఆర్‌డీ గుడివాడ శంకరజగన్నాథ్, పీఈటీలు, సచివాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**క్రీడాకారులకు గుర్తింపు**

పూసపాటిరేగ : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంతో క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్ జిల్లా పీడీ బి. శాంతాకుమారి అన్నారు. మండలంలోని పూసపాటిరేగ-2, కుమిలి-2, గుంపాం సచివాలయాల పరిధి క్రీడాకారులకు వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. క్రీడలలో రాణించిన వ్యక్తులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, కొవ్వాడ, వెంపడాం సర్పంచ్‌లు కోట్ల రఘు, పిన్నింటి కుమార్, ఎంపీడీఓ ఎం .రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా ..**

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. అలుగోలు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సారిపల్లి, కొండగుంపాం, రామతీర్థం, మొయిద సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు.. కొండవెలగాడ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహిళల కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆయా పాఠశాలలకు చెందిన పీడీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలను మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు.

**ప్రతిష్టాత్మకంగా..**

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. మండలంలోని సారిక, జొన్నవలస, మలిచర్ల, నారాయణపురం, ద్వారపూడి గ్రామాల్లో నిర్వహించిన పోటీలను ఎంపీపీ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి సాయంత్రం లోగా కిట్లు పంపిణీ చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ గురువారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సీడీపీఓలను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లాలో ఇంకా 25 శాతం కిట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలోని ఎంపీడీఓలు, కమిషనర్లు, సీడీపీఓలతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నేపథ్యంలో పిల్లలకు భోజన సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్‌చార్జులుగా నియమితులైన సచివాలయ సిబ్బంది స్థానిక వలంటీర్ల సహాయంతో పిల్లలను కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రానికి హాజరయ్యే పిల్లలందరికీ వేడి ఆహారం అందజేయాలని సూచించారు. పాఠశాలల్లో వంటలు వండే ఏజెన్సీలతో ఏయే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నదీ మ్యాపింగ్ చేయాలని తెలిపారు. అలాగే ఆడుదాం ఆంధ్రా మ్యాచ్‌ల నిర్వహణలో లోపాలను సరిదిద్ది షెడ్యూల్ ప్రకారం పోటీలు జరిగేలా చూడాలన్నారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ, మైదానాల్లో క్రీడాకారులకు తగిన వసతులు కల్పించాలని సూచించారు.

## ఘనంగా 'చిన్న శ్రీను సోల్జర్స్' వార్షికోత్సవం



చిన్న శ్రీను సోల్జర్స్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

విజయనగరం: సేవే పరమావధిగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న చిన్న శీను సోల్జర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏడాది కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ అధ్యక్షురాలు సిరి సహస్ర అధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రాజీవ్ స్టేడియం, మహిళా పార్క్ దగ్గర ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు పంపిణీ చేశారు. అనంతరం గంటస్తంభం దగ్గర కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు శ్రీనివాస్, శివ, జగదీశ్, అభిరాం, అశోక్, జగన్, సాయి, అనంత్, దక్షిణమూర్తి, డి.జగదీశ్, రవి, తదితరులు పాల్గొన్నారు .

## క్రీడాకారులకు సదుపాయాలు కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మెంటాడ(గజపతినగరం రూరల్): 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మరుపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడాపోటీలను ఆమె పరిశీలించా రు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు కూడా బాగుండాలన్నారు. మైదా నాల వద్ద కనీస వసతులు కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ కిశోర్‌కుమార్, సర్పంచ్ రామలక్ష్మి ఉన్నారు.

### 30న హిందూ ధార్మిక సమ్మేళనం

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని గ్రీన్‌సిటీ లేఅవుట్‌లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆశాఖ ప్రతినిధి కొరుపోలు అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అతిథిగా ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి హాజరవుతారని పేర్కొన్నారు. సనాతన,సంస్కృతీ,సంప్రదాయాలు, వాటి విశిష్టతను మననం చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

## లెప్రసీ సర్వే ప్రారంభం



వియ్యంపేట పీహెచ్‌సీలో వాల్ పోస్టర్లును ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ, తదితరులు

కొత్తవలస: వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల పరిధిలో లెప్రసీ సర్వే బుధవారం ప్రారంభమైంది. ముందుగా ఆయా పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు గోపాలకృష్ణ, సీతల్‌వర్మ వైద్య సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ జనవరి12వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను 20 బృందాలుగా ఏర్పాటు చేశామని, వీరు ప్రతీ ఇంటికి వెళ్లి లెప్రసీ సర్వే చేసి, వ్యాధి గ్రస్తులను గుర్తిస్తా రన్నారు. శరీరంపై స్పర్శలేని రాగి, గోదుమ రంగుమచ్చలు ఉంటే కుష్టు వ్యాధిగా పరిగణించవచ్చన్నారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి, మందులు వినియోగిస్తే అంగవైకల్యం రాదన్నారు.అనంతరం సర్వేకు సంబంధించిన వాల్ పోస్టర్లును ఆవిష్కరించారు.

### స్టైఫండ్ ఇవ్వాలంటూ ధర్నా

విజయనగరం ఫోర్ట్: స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ఫారన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ (ఎఫ్ఎంజీ) బుధవారం ధర్నా నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల్లో రూ. 40 వేలు స్టైఫండ్ ఇస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా అంతే మొత్తం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం పుష్కర ఘాట్‌లో రూ.75 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించనున్నామని ఈఓ కిషోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా నగరంలోని లంకాపట్నం 11 కేవీ ఫీడర్ పరిధిలో గల సర్వీసులకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లంకాపట్నం, బంగారమ్మపేట, స్కీపర్ కాలనీ, కుమ్మరవీధి, లక్ష్మీగణపతి కాలనీ, సుబ్రహ్మణ్యస్వామి కోవెల ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### విద్యార్థి వైద్యం కోసం సహాయం



పవన్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న ఎంపీపీ

గుర్ల: మండలంలోని పాలవలస హైస్కూల్ విద్యార్థి కె. పవన్ కుమార్ పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. విద్యార్థి వైద్యం కోసం అమ్మ సేవా సొసైటీ సభ్యులు సమకూర్చిన రూ.10వేల నగదును ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు పాఠశాల వద్ద విద్యార్థికి బుధవారం అందజేశారు. అమ్మ సేవా సొసైటీ సేవలను నాయకులు కొనియాడారు. వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, అమ్మ సేవా సొసైటీ సభ్యుడు పురుషోత్తం పాల్గొన్నారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



సిలిండర్ నుంచి వచ్చే మంటలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కొత్తవలస: అగ్నిప్రమాదాల నివారణపై కొత్తవలస అగ్నిమాపకశాఖ ఎస్ఐ వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో తుమ్మికాపల్లి గేటు సమీపంలోని కాలనీ మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఇళ్లలో వంట చేసేటప్పుడు గ్యాస్‌లీకై సిలిండర్ నుంచి వచ్చే మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే నష్టాన్ని నివారించవచ్చని ఎస్ఐ చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది పి.గిరిబాబు, ఎ.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్‌దారులకు అండగా ఉంటాం..



మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: పింఛన్‌దారులకు ఏ సమస్య వచ్చినా తానెప్పుడూ అండగా ఉంటానని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అంతర్జాతీయ పెన్షనర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, పెన్షన్‌దారుల జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అందుకు తగిన విధంగా ముందస్తు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. గతంలో డీఎస్ నకారా అందించిన సేవలు మరువలేనివన్నారు. పింఛనుదారుల సమస్యలు పరిష్కరించేందుకు చక్కటి వేదిక ఏర్పాటు చేసిన ఘనత వీఎస్.శాస్త్రిదేనని తెలిపారు. పింఛనుదారుల సంక్షేమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అనంతరం వివిధ సేవలందించిన పలువురు పింఛన్‌దారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు బి.విశ్వనాథ్, కుప్పారావు, వెంకటరావు, సుబ్బారావు, పెద్దింటి అప్పారావు, జగన్నాథరాజు, వి.ప్రసాదరావు, సీహెచ్‌వీ.అప్పన్న, కేవీ రావు, పద్మనాభం, సీహెచ్. త్రినాథ్, భాస్కరరావు, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేరువ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే బ్రోచర్లు అందజేశారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లుగా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేసే అనేక పథకాల్లో మహిళలను భాగస్వాములను చేశామన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రిక్కా దుర్గాలమ్మ, పడాల భానుప్రకాశ్, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, రాయి ఈశ్వరరావు, సుందర హరీష్, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు ప్రారంభం**

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండంలోని చెరుకుపల్లి పంచాయతీలో సుమారు రూ.30 లక్షల జెడ్పీ, ఎంపీపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.